ప్రజానేస్తం జ్వాల

నిజం కోసం... నిర్భయంగా...

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

‘జ్ఞానేశ్ కుమార్ దిగిపోవాలి’.. ఇండియా కూటమి ర్యాలీకి ‘కాక్రోచ్ జనతా పార్టీ’ మద్దతు!

2

అక్టోబర్ 29 గురువారం 2026 | సంపుటి : 1 | సంచిక : 20 | పేజీలు : 6 | వెల రూ. 4.00/- | ఎడిటర్ : చెన్నగాని పురుషోత్తం

THURSDAY OCTOBER 29 2026 | VOL:1 | ISSUE: 20 | PAGES:6 | Rs. 4:00 | EDITOR: CHENAGANI PURUSHOTHAM

తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వద్దు!

నీటి నాణ్యతపై రాజీ పడొద్దు.. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

ఎస్‌టీపీల నిర్వహణకు ప్రత్యేక అధికారులు

ట్రీటెడ్ వాటర్ వినియోగంపై కఠిన నిబంధనలు

ఏఐ సాంకేతికతతో ప్లాంట్ల నిర్వహణ.. కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం

ట్యాంకర్ల ట్రాకింగ్‌కు ప్రత్యేక వ్యవస్థ.. టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



హైదరాబాద్, అక్టోబరు 28: రాష్ట్రంలో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజలకు సరఫరా చేసే నీటి నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేశారు. బుధవారం ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో మురుగునీటి శుద్ధి కేంద్రాలు (ఎస్‌టీపీలు), శుద్ధి చేసిన నీటి వినియోగంపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని నీటి నిర్వహణ వ్యవస్థను పటిష్టం చేయాలని, శుద్ధి చేసిన నీటిని సమర్థంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ప్రతి ప్లాంట్‌కు ప్రత్యేక అధికారి

రాష్ట్రంలోని ప్రతి ఎస్‌టీపీ వద్ద ప్రత్యేక అధికారిని నియమించాలని సీఎం ఆదేశించారు. అన్ని ప్లాంట్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించాలని, వాటి పనితీరును హైడ్రా నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. శుద్ధి చేసిన నీటి నాణ్యత, సరఫరా, వినియోగంపై నిరంతర నిఘా ఉండాలని స్పష్టం చేశారు. ప్లాంట్ల నిర్వహణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని, ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత విధానాలను అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

ప్రభుత్వ అవసరాలకు శుద్ధి చేసిన నీరే

ఔటర్ రింగ్ (మిగతా 2వ పేజీలో..)

ప్రజాసేవలో ఏఐతో సరికొత్త మార్పులు!

హైదరాబాద్, అక్టోబరు 28:

కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికతను ఉపయోగించి ప్రజలకు మరింత వేగవంతమైన, మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావడానికి ఏఐని సమర్థంగా వినియోగించాలని సూచించారు. బుధవారం నిర్వహించిన ‘ఏఐ సాక్షమ్’ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల వేగం పెంచేందుకు ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించడంతోపాటు, కార్యాలయాల్లో ఆదా అయ్యే సమయాన్ని ప్రజాసేవకు కేటాయించాలని స్పష్టం చేశారు.

కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి మారాలి

ప్రభుత్వ సేవల కోసం రైతులు, పింఛనుదారులు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితికి ముగింపు పలకాలని భట్టి విక్రమార్క అన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సామర్థ్యాన్ని పెంపొందించి, పరిపాలనను మరింత సమర్థంగా మార్చేందుకు ‘ఏఐ సాక్షమ్’ను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన సేవలు సులభంగా, వేగంగా అందేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. ఫైళ్ల పరిష్కారం, సమాచార విశ్లేషణ, ప్రభుత్వ కార్యక్రమాల పర్యవేక్షణ వంటి అంశాల్లో ఏఐ ద్వారా పనిభారాన్ని తగ్గించి, సేవల నాణ్యతను పెంచవచ్చని వివరించారు.

సంక్షేమ పథకాల అమలులో కీలక పాత్ర

ప్రజాధనం వినియోగం, అభివృద్ధి ప్రాజెక్టుల వ్యయాల విశ్లేషణలో ఏఐ సాంకేతికత ఉపయోగకరంగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ చేరుతున్నాయా లేదా అనే విషయాన్ని గుర్తించేందుకు ఈ సాంకేతికత దోహదపడుతుందని తెలిపారు. పథకాల అమలులో లోపాలను గుర్తించి, అవసరమైన దిద్దుబాటు చర్యలు చేపట్టేందుకు ఏఐ విశ్లేషణను వినియోగించుకోవచ్చని చెప్పారు.



(మిగతా 2వ పేజీలో..)

కేటీఆర్ పాస్‌పోర్ట్ వివాదం.. యథాతథ స్థితి కొనసాగించాలన్న హైకోర్టు



ఫార్ములా ఈ రేస్ నిధుల మళ్లింపు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావుకు తెలంగాణ హైకోర్టులో తాత్కాలిక ఊరట లభించింది. ఆయన పాస్‌పోర్ట్‌కు సంబంధించి జారీ అయిన నోటీసుల విషయంలో యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.ఫార్ములా ఈ కేసులో విచారణ జరుపుతున్న అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ), కేటీఆర్ పాస్‌పోర్ట్‌ను స్వాధీనం చేసుకోవాలని కోరుతూ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయానికి (ఆర్‌పీవో) లేఖ రాసింది. ఏసీబీ అభ్యర్థన మేరకు పాస్‌పోర్ట్ అధికారులు కేటీఆర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం, పాస్‌పోర్ట్ నోటీసుల ప్రక్రియలో యథాతథ స్థితిని పాటించాలని ఆదేశించింది. అనంతరం, కేసు తదుపరి విచారణను నవంబర్ 6వ తేదీకి వాయిదా వేసింది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులతో కేటీఆర్ పాస్‌పోర్టును స్వాధీనం చేసుకునే ప్రక్రియకు ప్రస్తుతానికి అడ్డుకట్ట పడినట్లయింది.

అర్నబ్ తుపాను ఎఫెక్ట్: తెలంగాణకు భారీ వర్ష సూచన.. రైళ్లు, విమానాల రద్దు



అర్నబ్ తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో జనజీవనంపై ప్రభావం పడుతోంది. తెలంగాణలో బుధవారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. రాష్ట్రంలోని జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, వరంగల్, మహబూబాబాద్, హనుమకొండ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. తుపాను పరిస్థితుల కారణంగానే విమానాలను రద్దు చేసినట్లు జీఎంఆర్ వర్గాలు ప్రకటించాయి. మరోవైపు, దక్షిణ మధ్య రైల్వే కూడా అప్రమత్తమైంది. కోస్తాంధ్ర, తూర్పు తెలంగాణలో భారీ వర్షాల నేపథ్యంలో రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ముందుజాగ్రత్త చర్యగా మంగళవారం 11 రైళ్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. రద్దయిన రైళ్లలో ఫలక్‌నుమా, గోదావరి, విశాఖ, గౌతమి, కోకనాడ, నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లు ఉన్నాయి. ప్రయాణికులు తమ ప్రయాణానికి ముందు రైళ్ల ప్రస్తుత స్థితిని ఐఆర్‌సీటీసీ, ఎన్‌టీఈఎస్ వంటి అధికారిక యాప్‌లలో సరిచూసుకోవాలని రైల్వే అధికారులు సూచించారు.

బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు.. కాంగ్రెస్ ఖాతా తెరిచిందా?: మోదీ సెటైర్

నాలుగు రాష్ట్రాల్లో 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఉపఎన్నికలు

12 స్థానాల్లో పోటీ చేసిన కాంగ్రెస్

కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా దక్కని వైనం

ఎన్నికలు బ్యాలెట్ పత్రాలతో జరిగాయని గుర్తుచేసిన ప్రధాని మోదీ

మోనోకిల్ ఎమోజీతో కాంగ్రెస్‌పై మోదీ సెటైర్

నాలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎమ్మెల్సీ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ ఒక్క స్థానాన్నీ గెలుచుకోలేకపోయింది. ఈ ఫలితాలపై ప్రధాని నరేంద్ర మోదీ వ్యంగ్యంగా స్పందించారు. బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు జరిగాయని గుర్తుచేస్తూ, కాంగ్రెస్ ఎన్ని స్థానాలు గెలిచిందో ఊహించాలంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. దీనికి ‘మోనోకిల్’ ఎమోజీని జతచేశారు. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, కర్ణాటక రాష్ట్రాల్లో



ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపు!

కేంద్ర ప్రభుత్వంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపణలు

ఓటు హక్కును కోల్పోయిన వారికి న్యాయం చేయాలి

రాహుల్ గాంధీ, ఖర్గే రెండేళ్లుగా పోరాడుతున్నారు

నవంబర్ 1న దేశవ్యాప్తంగా డ్డంకులు సృష్టిస్తున్నారని విమర్శ

ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ ఆందోళన



హైదరాబాద్, అక్టోబరు 28: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల సంఘాన్ని (మిగతా 2వ పేజీలో..)

రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది: కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్ రావు ధ్వజం

మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణకు వెళ్లకుండా బీఆర్ఎస్ నేతలను దిగ్బంధించారన్న హరీశ్

కరవుతో అల్లాడుతున్న రైతులను ఆదుకోవడం చేతకాని ప్రభుత్వమని విమర్శ

ప్రతిపక్షాల గొంతును ఎంతకాలం అణచివేస్తారని ప్రశ్న

మూసీ నది ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణకు హాజరుకాకుండా బీఆర్ఎస్ నేతలను గృహనిర్బంధం చేశారని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎమర్జెన్సీ తరహా పాలన సాగిస్తూ, ప్రతిపక్షాల గొంతు నొక్కుతోందని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. హైదరాబాద్‌లోని వాలంతరిలో మూసీ ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ జరగాల్సి ఉంది. ఈ కార్యక్రమానికి హాజరుకావడానికి సిద్ధమైన మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఆమె కుమారుడు కార్తీక్ రెడ్డిలను (మిగతా 2వ పేజీలో..)



టాటా గ్రూప్‌ను నాశనం చేస్తున్నారు: మోదీ, అమిత్ షాలపై రాహుల్ గాంధీ ఫైర్

టాటా గ్రూప్‌ను నేరపూరితంగా నాశనం చేస్తున్నారన్న రాహుల్ గాంధీ

మోదీ, అమిత్ షాలపై తీవ్ర విమర్శలు

భయంతోనే వ్యాపారవేత్తలు మౌనంగా ఉన్నారని ఆరోపణ

లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ టాటా గ్రూప్‌పై సంచలన ఆరోపణలు చేశారు. టాటా సంస్థను ‘నేరపూరితంగా నాశనం’ చేస్తున్నారని, అయినా దేశంలోని వ్యాపారవేత్తలు భయంతో నోరు మెదపడం లేదని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. ఈ మేరకు ‘ఎక్స్’ వేదికగా ఆయన ఒక పోస్ట్ చేశారు.“భారతీయ వ్యాపార రంగం మోదీ, అమిత్ షాల ఆటవస్తువు కాదు. మీకు ధైర్యం లేదు, మాకుంది. ఈ నేరాలకు న్యాయం జరిగేలా చూస్తాం” అని రాహుల్ తన పోస్టులో పేర్కొన్నారు. టాటా గ్రూప్‌లో కొంతకాలంగా నడుస్తున్న అంతర్గత వివాదం నేపథ్యంలో రాహుల్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. టాటా సన్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్ (మిగతా 2వ పేజీలో..)



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

‘జ్ఞానేశ్ కుమార్ దిగిపోవాలి’.. ఇండియా కూటమి ర్యాలీకి ‘కాక్రోచ్ జనతా పార్టీ’ మద్దతు!

నవంబర్ 1న ఢిల్లీలో ఆందోళన

జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు డిమాండ్

అర్హుల ఓటు హక్కును కాపాడాలని విజ్ఞప్తి

అంబేడ్కర్ సమాన ఓటు హక్కును ప్రస్తావించిన పార్టీ

స్వేచ్ఛాయుత ఎన్నికల కోసం పోరాడుతామని ప్రకటన



ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలంటూ ప్రతిపక్ష ఇండియా కూటమి చేపట్టనున్న ఆందోళనకు ‘కాక్రోచ్ జనతా పార్టీ’ (సీజేపీ) మద్దతు ప్రకటించింది. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరగనున్న ర్యాలీకి అండగా నిలుస్తామని వెల్లడించింది. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఆందోళన వ్యక్తం చేసింది. అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆరోపించింది. అయితే, తమ నేతలు కూడా ఇండియా కూటమి నేతలతో కలిసి ఆందోళనలో పాల్గొంటారా, లేదా అనే అంశంపై సీజేపీ స్పష్టత ఇవ్వలేదు. ప్రజలు తమ పాలకులను ఎన్నుకోవాలి కానీ, ఎవరెవరు ఓటు వేయాలో ప్రభుత్వమే నిర్ణయించకూడదని సీజేపీ తన ప్రకటనలో పేర్కొంది. స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని తెలిపింది. అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడాలని కోరింది. ఈ విషయంలో ఎన్నికల సంఘంపై ప్రజలకు నమ్మకం తిరిగి కలగాలంటే జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేసింది. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను కూడా సీజేపీ తన ప్రకటనలో ప్రస్తావించింది. కులం, మతం, లింగం, విద్య, ఆర్థిక స్థితితో సంబంధం లేకుండా ప్రతి వయోజనుడికి సమాన ఓటు హక్కు కల్పించడమే ప్రజాస్వామ్యానికి పునాది అని పేర్కొంది. పౌరులను ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములను చేయాలి తప్ప, వారి హక్కులకు అడ్డంకులు సృష్టించకూడదని అభిప్రాయపడింది. స్వేచ్ఛాయుత ఎన్నికల కోసం పోరాడే సంస్థలకు మద్దతుగా నిలుస్తామని స్పష్టం చేసింది. జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఇండియా కూటమి నవంబర్ 1న భారీ ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఓటరు జాబితాల సవరణ, ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలే ఈ ఆందోళనకు ప్రధాన కారణాలు. అయితే ఎస్ఐఆర్ ద్వారా అనర్హుల పేర్లను తొలగించడమే లక్ష్యమని ఎన్నికల సంఘం చెబుతుండగా.. అర్హులైన ఓటర్లు హక్కు కోల్పోయే ప్రమాదం ఉందని ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

‘ప్రతిచోటా దెయ్యాలే కనిపిస్తున్నాయా?’.. రాహుల్‌కు నిర్మల ఘాటు కౌంటర్

టాటా గ్రూప్ వ్యవహారం ఇప్పుడు రాజకీయ దుమారం రేపుతోంది. ఆ సంస్థను ఉద్దేశపూర్వకంగా దెబ్బతీస్తున్నారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఘాటుగా స్పందించారు. ప్రతి అంశాన్నీ రాజకీయ కోణంలో చూడొద్దని, వాణిజ్య, న్యాయపరమైన విషయాలను నేరాలుగా చిత్రీకరించడం సరికాదని హితవు పలికారు. ‘ప్రతిచోటా దెయ్యాలను వెతకడం మానుకోండి’ అంటూ ఎక్స్ వేదికగా చురకలంటించారు. టాటా గ్రూప్ తీవ్ర సంక్షోభంలో ఉందని, ఆ సంస్థను నేరపూరితంగా నాశనం చేస్తున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ వ్యవహారంపై వ్యాపార ప్రముఖులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. తమ దాకా వస్తే గానీ తెలియదా? అంటూ విమర్శించారు. భారత వ్యాపార రంగం ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేతుల్లోని ఆటబొమ్మ కాదని వ్యాఖ్యానించారు. ఈ పరిణామాలపై న్యాయం జరిగేలా చూస్తామని పేర్కొన్నారు.రాహుల్ వ్యాఖ్యలపై స్పందించిన నిర్మలా సీతారామన్.. భారత పరిశ్రమలు, పారిశ్రామికవేత్తల విజయాలను కాంగ్రెస్ పదేపదే తక్కువ చేసి చూపుతోందని విమర్శించారు. వ్యాపార రంగంలో అవిశ్వాసం, విషపూరిత వాతావరణం వ్యాప్తి చేసేందుకు రాహుల్ ప్రయత్నిస్తున్నారా? అని ప్రశ్నించారు. గతంలో కాంగ్రెస్ పాలనలోని లైసెన్స్-కోటా విధానం పారిశ్రామికవేత్తల స్వేచ్ఛను దెబ్బతీసిందని ఆరోపించారు. తమ ప్రభుత్వం పరిశ్రమల అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి కల్పనకు ప్రాధాన్యమిస్తోందని పేర్కొన్నారు. టాటా సన్స్ ఛైర్మన్‌గా ఎన్. చంద్రశేఖరన్‌ను మరో ఐదేళ్లపాటు కొనసాగించాలన్న నిర్ణయంపై వివాదం నెలకొంది. సెప్టెంబర్ 17న జరిగిన బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా సవాల్ చేశారు. ఆ నిర్ణయం చెల్లదని, నిబంధనల ప్రకారం జరగలేదని అభ్యంతరం వ్యక్తం చేశారు.





తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వద్దు!

మొదటి పేజీ తరువాయి)

రోడ్డుతోపాటు ఇతర ప్రాంతాల్లోని ల్యాండ్‌స్కేపింగ్, రహదారుల శుభ్రతకు శుద్ధి చేసిన నీటినే వినియోగించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. సచివాలయం, ముఖ్యమంత్రి కార్యాలయ పరిసరాల్లోని పచ్చదనం, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా పార్కుల్లోనూ ఈ నీటిని ఉపయోగించాలని ఆదేశించారు. రైల్వే శాఖ, మెట్రో రైలు వ్యవస్థను కూడా శుద్ధి చేసిన నీటి వినియోగ పరిధిలోకి తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో తాగునీరు అవసరం లేని ఇతర పనులకు వందశాతం శుద్ధి చేసిన నీటిని వినియోగించడం తప్పనిసరి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ట్యాంకర్ల కదలికలపై నిఘా

శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసే ట్యాంకర్ల కదలికలను ట్రాక్ చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఈ నీటి లభ్యత, వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. శుద్ధి చేసిన నీటిని పొందేందుకు ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. భవన నిర్మాణ అనుమతులు మంజూరు చేసే దశలోనే అవసరమైన చోట్ల శుద్ధి చేసిన నీటి వినియోగ నిబంధనలను విధించాలని స్పష్టం చేశారు. ఎస్‌టీపీల నిర్వహణకు సౌర విద్యుత్‌ను వినియోగించే అవకాశాలను పరిశీలించడంతోపాటు, ప్రైవేటు రంగంలో శుద్ధి కేంద్రాల ఏర్పాటును ప్రోత్సహించాలని సూచించారు.

డేటా సెంటర్లకూ ట్రీటెడ్ వాటర్

నీటి వినియోగం అధికంగా ఉండే డేటా సెంటర్లకు కూడా శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. నీటి వనరులపై ఒత్తిడి తగ్గించేందుకు తాగునీటిని తాగడానికి, శుద్ధి చేసిన నీటిని ఇతర అవసరాలకు వినియోగించే విధానాన్ని విస్తృతంగా అమలు చేయాలని అధికారులకు తెలిపారు. నవంబర్ 1 నుంచి డిసెంబర్ వరకు నిర్దేశించిన ఆదేశాలు అమలయ్యేలా పర్యవేక్షించాలని సూచించారు. నీటి సరఫరా వ్యవస్థలో ఎక్కడా నిర్లక్ష్యానికి తావులేకుండా, భవిష్యత్తులో పెరిగే అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

ఉన్నతాధికారుల హాజరు

ఈ సమీక్షా సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, టీజీఎస్‌పీడీసీఎల్ ఎండీ జితేశ్ వి. పాటిల్, కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి రవి, సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుందరెడ్డి తదితరులు హాజరయ్యారు. తాగునీటి సరఫరాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, నీటి నాణ్యత విషయంలో అధికారులు పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

ఎస్ఐఆర్ పేరుతో ఓట్ల తొలగింపు!

మొదటి పేజీ తరువాయి)

అడ్డం పెట్టుకొని ఓట్లను తొలగిస్తోందని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఈ అంశంపై కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గత రెండేళ్లుగా పోరాటం చేస్తున్నారని తెలిపారు. ఓట్ల తొలగింపు జరుగుతోందన్న తమ ఆందోళనలు నిజమని తేలిందని ఆయన వ్యాఖ్యానించారు.

తొలగించిన ఓట్లను పునఃపరిశీలించాలి

ఓటర్ల జాబితా నుంచి తొలగించిన ఓట్లను తిరిగి పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోందని పొంగులేటి పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హులైన ఓటర్లు తమ హక్కును కోల్పోకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని అన్నారు. ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం స్పందించకుండా నిద్రపోతున్నట్లు నటిస్తున్నాయని విమర్శించారు.

నవంబర్ 1న ఇండియా కూటమి నిరసనలు

ఎస్ఐఆర్ ప్రక్రియపై తమ నిరసనను దేశవ్యాప్తంగా తెలియజేయాలని ఇండియా కూటమి నిర్ణయించినట్లు మంత్రి వెల్లడించారు. నవంబర్ 1న కూటమి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై సమగ్ర పరిశీలన జరిపి, ప్రజల సందేహాలను నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన ఓటర్లకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ తన పోరాటాన్ని కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

రైళ్ల అనుమతులపై కేంద్రం తీరుపై విమర్శలు

ఇండియా కూటమి కార్యక్రమాల కోసం రైళ్లలో ప్రయాణించేందుకు అనుమతి కోరినా కేంద్రం నుంచి అనుమతి లభించలేదని పొంగులేటి ఆరోపించారు. గత పది రోజులుగా కూటమిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. రైల్వే వ్యవస్థ కేంద్ర ప్రభుత్వం లేదా బీజేపీ సొంత ఆస్తి కాదని, ప్రజలకు సేవలందించాల్సిన వ్యవస్థ అని వ్యాఖ్యానించారు. రాజకీయ కార్యక్రమాలకు రైళ్లు, బోగీలు అందించకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

కేంద్రం తీరుపై పీసీసీ నిరసన

రైళ్లు, బోగీలు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ పీసీసీ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును ప్రజల ముందుకు తీసుకువస్తామని పేర్కొన్నారు. కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలు, ప్రతిపక్షాలకు ఎదురవుతున్న అడ్డంకులపై ఒక్కొక్క అంశాన్ని బయటపెడతామని పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. ఓటర్ల హక్కులు, ప్రతిపక్షాల ప్రజాస్వామ్య నిరసనలకు సంబంధించిన అంశాలపై తమ పోరాటం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.

ప్రజాసేవలో ఏఐతో సరికొత్త మార్పులు!

మొదటి పేజీ తరువాయి)

విద్యుత్ డిమాండ్‌ను ముందుగానే అంచనా వేయడం, విద్యుత్ పరికరాల్లో తలెత్తే లోపాలను గుర్తించడం వంటి పనుల్లోనూ ఏఐ కీలకంగా ఉపయోగపడుతుందని వివరించారు.

ప్రభుత్వ పనుల్లో సమయ ఆదా

ప్రభుత్వ ఉత్తర్వులు, నివేదికల తయారీతోపాటు వివిధ పరిపాలనా ప్రక్రియలను వేగవంతం చేయడంలో ఏఐ దోహదపడుతుందని భట్టి విక్రమార్క అన్నారు. అయితే, ఏఐ అందించే సమాచారాన్ని అధికారులు పరిశీలించి, వాస్తవాలను ధ్రువీకరించుకున్న తర్వాతే నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సాంకేతికతపై పూర్తిగా ఆధారపడకుండా, దాని ద్వారా లభించే సమాచారాన్ని బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. చిన్నస్థాయిలో ప్రయోగాలు నిర్వహించి, వాటి ఫలితాలను అంచనా వేసిన తర్వాతే ఏఐ వ్యవస్థలను విస్తృతంగా అమలు చేయాలని అధికారులకు మార్గనిర్దేశం చేశారు.

సమాచార భద్రతకు ప్రాధాన్యం

ప్రజల వ్యక్తిగత సమాచార భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఏఐ ఆధారంగా తీసుకునే నిర్ణయాలపై మానవ పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు. సాంకేతికత వినియోగంలో తప్పులు తలెత్తితే వాటికి బాధ్యత వహించే వ్యక్తి ఎవరో స్పష్టంగా నిర్ధారించే విధానం ఉండాలని పేర్కొన్నారు. ప్రజల గోప్యతకు భంగం కలగకుండా, పారదర్శకతతో ఏఐ వ్యవస్థలను వినియోగించాలని సూచించారు.

ప్రజాసేవే ఏఐ విజయానికి కొలమానం

ఏఐ వినియోగం కేవలం కార్యాలయాల పనితీరును మెరుగుపరచడానికే పరిమితం కాకుండా, ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనాలు అందించేలా ఉండాలని భట్టి విక్రమార్క అన్నారు. ప్రభుత్వ సేవల్లో జాప్యాన్ని తగ్గించడం, సమస్యలను త్వరగా పరిష్కరించడం, సంక్షేమ పథకాలను అర్హులకు చేరవేయడం వంటి అంశాల్లో స్పష్టమైన ఫలితాలు కనిపించాలని తెలిపారు. ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించగలిగినప్పుడే ఏఐ వినియోగం విజయవంతమైనట్లు భావించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

బ్యాలెట్ పేపర్లతో ఎన్నికలు.. కాంగ్రెస్ ఖాతా తెరిచిందా?: మోదీ సెటైర్

మొదటి పేజీ తరువాయి)

మొత్తం 28 ఎమ్మెల్సీ స్థానాలకు ఉపఎన్నికలు జరిగాయి. కాంగ్రెస్ 12 స్థానాల్లో పోటీ చేసింది. గతంలో ఆ పార్టీ గెలిచిన నాలుగు స్థానాలు కూడా ఈ ఎన్నికల్లో ఉన్నాయి. అయినా ఈసారి ఒక్క చోటా విజయం సాధించలేకపోయింది. కర్ణాటకలో అధికారంలో ఉన్నప్పటికీ కాంగ్రెస్‌కు సీటు దక్కకపోవడం గట్టి ఎదురుదెబ్బగా మారింది. ఈ ఫలితాలను ప్రస్తావిస్తూ మోదీ కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. ఓటింగ్ యంత్రాల్లో అక్రమాలు జరుగుతున్నాయంటూ కాంగ్రెస్ గతంలో ఆరోపణలు చేసింది. బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహించాలని కూడా కోరింది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీ ఎన్నికలు బ్యాలెట్ పత్రాలతోనే జరిగాయని మోదీ గుర్తుచేశారు. అయినా కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాలేదంటూ పరోక్షంగా ఎద్దేవా చేశారు.

టాటా గ్రూప్‌ను నాశనం చేస్తున్నారు: మోదీ, అమిత్ షాలపై రాహుల్ గాంధీ ఫైర్

మొదటి పేజీ తరువాయి)

పునర్‌నియామకాన్ని టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా సవాలు చేశారు. సెప్టెంబర్ 17న జరిగిన బోర్డు తీర్మానం చెల్లదని, నియామక ప్రక్రియలో నిబంధనలు పాటించలేదని ఆయన అక్టోబర్ 26న రాసిన లేఖలో ఆరోపించారు. ఈ వివాదం కార్పొరేట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మరోవైపు, రాహుల్ ఆరోపణలపై బీజేపీ నేత సీఆర్ కేశవన్ స్పందించారు. రాహుల్ గాంధీకి ఆర్థికశాస్త్రంపై అవగాహన లేదని విమర్శించారు.



రాష్ట్రంలో ఎమర్జెన్సీ పాలన నడుస్తోంది: కాంగ్రెస్ సర్కార్‌పై హరీశ్ రావు ధ్వజం

మొదటి పేజీ తరువాయి)

పోలీసులు శ్రీనగర్ కాలనీలోని వారి నివాసంలో గృహ నిర్బంధం చేశారు. తెల్లవారుజాము నుంచే వారి ఇంటి వద్ద భారీగా పోలీసులు మోహరించి, బయటకు రాకుండా అడ్డుకున్నారు.ఈ ఘటనపై హరీశ్ రావు ఎక్స్ వేదికగా స్పందించారు. “కరవుతో రైతులు అల్లాడుతుంటే ఆదుకోవడం చేతకాని ప్రభుత్వం, రూ. 1.50 లక్షల కోట్లతో మూసీ ప్రక్షాళన పేరుతో కమిషన్ల కోసం ప్రాజెక్టులు చేపడుతోంది” అని ఆరోపించారు. పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ, ప్రతిపక్షాల గొంతును ఎంతకాలం అణచివేస్తారని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన ముసుగులో జరుగుతున్న దోపిడీ యత్నాలను తెలంగాణ సమాజం తిప్పికొడుతుందని, కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెబుతుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కూడా అరెస్టులను ఖండించారు. ఇది అప్రజాస్వామిక చర్య అని, మూసీ పరీవాహక ప్రాంత ప్రజలకు అండగా నిలుస్తున్నందుకే తమను అక్రమంగా నిర్బంధించారని ఆరోపించారు. గృహనిర్బంధంలో ఉన్న బీఆర్ఎస్ నేతలను తక్షణమే విడుదల చేయాలని పార్టీ తరఫున డిమాండ్ చేశారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మెతో వైద్య సేవలకు అంతరాయం!





- **15 రోజులుగా నిరవధిక ఆందోళన.. గ్రామాల్లో టీకాల పంపిణీకి ఇబ్బందులు**
- **ముల్కనూర్, వంగర పీహెచ్‌సీల పరిధిలో 14 మంది ఉద్యోగులు సమ్మెలో..**
- **స్పెషల్ డ్రైవ్‌తో టీకాల పంపిణీకి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు: వైద్యాధికారులు డాక్టర్ మునీబ్,డాక్టర్ రహమాన్**

భీమదేవరపల్లి, అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):

నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగుల నిరవధిక సమ్మెతో గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలకు ఆటంకం ఏర్పడుతోంది. ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని, కనీస వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వ రాయితీలు, ఇతర ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సిబ్బంది గత 15 రోజులుగా ఆందోళన కొనసాగిస్తున్నారు. భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్, వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పనిచేస్తున్న 14 మంది ఉద్యోగులు ఈ సమ్మెలో పాల్గొంటున్నారు.

గ్రామీణ వైద్య సేవలపై సమ్మె ప్రభావం

ఎన్‌హెచ్‌ఎం సిబ్బంది సమ్మెలో ఉండటంతో గ్రామాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాల పరిధిలో సాధారణంగా అందే వైద్య సేవలకు అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందించాల్సిన ఆరోగ్య సేవలతో పాటు టీకాల పంపిణీలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గ్రామాల్లోనే టీకాలు వేయించే అవకాశం తగ్గడంతో తల్లిదండ్రులు చిన్నారులను తీసుకుని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

స్పెషల్ డ్రైవ్‌తో టీకాల పంపిణీకి చర్యలు:డాక్టర్ మునీబ్,డాక్టర్ రహమాన్

సమ్మె కారణంగా చిన్నారులకు టీకాలు అందకుండా ఉండకూడదనే ఉద్దేశంతో వైద్యాధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ మునీబ్ మాట్లాడుతూ.. సాధారణంగా వారానికి రెండు రోజులు నిర్వహించే టీకాల కార్యక్రమాన్ని ప్రత్యేక డ్రైవ్ ద్వారా వారమంతా ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. టీకాల కోసం వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ రహమాన్ సైతం తల్లిదండ్రులు ఈ ప్రత్యేక ఏర్పాట్లను సద్వినియోగం చేసుకుని చిన్నారులకు నిర్దిష్ట సమయంలో టీకాలు వేయించాలని సూచించారు.



ముల్కనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇన్‌చార్జి వైద్యాధికారి డాక్టర్ మునీబ్

ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపాలి

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె కొనసాగుతుండటంతో గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలపై ప్రభావం పడుతోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన సేవలు సకాలంలో అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంతో పాటు గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు నిరంతరాయంగా అందేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

డీలర్ల సమస్యలపై హరీశ్‌రావు వ్యాఖ్యలు అవాస్తవం: ఎరగాని నాగన్న గౌడ్

- **పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో డీలర్లను పట్టించుకోలేదు.. ఇప్పుడు ప్రభుత్వంపై విమర్శలా?**
- **డీలర్లతో చర్చలకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సుముఖం**

హుజూర్‌నగర్, అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):

రేషన్ డీలర్ల సమస్యలపై గజ్వేల్‌లో జరిగిన రాష్ట్ర సదస్సులో మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్న గౌడ్ ఖండించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో డీలర్ల సమస్యలను పట్టించుకోని వారు.. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు.బుధవారం హుజూర్‌నగర్‌లోని ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాగన్న గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డీలర్లకు సమయం ఇవ్వడం లేదన్న హరీశ్‌రావు వ్యాఖ్యలు వాస్తవ పరిస్థితులకు విరుద్ధమని పేర్కొన్నారు.

డీలర్ల వినతిపై మంత్రి స్పందించారు

రాష్ట్ర డీలర్ల యూనియన్ నాయకులు ఇటీవల హైదరాబాద్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారని నాగన్న గౌడ్ తెలిపారు. డీలర్ల సమస్యలను ప్రభుత్వం సాధ్యమైనంత వరకు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉందని మంత్రి హామీ ఇచ్చినట్లు చెప్పారు. ఈ సమస్యలను ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, త్వరలో డీలర్ల సంఘం ప్రతినిధులతో చర్చిస్తామని మంత్రి తెలిపినట్లు వివరించారు.ఈ పరిణామాలను పరిగణనలోకి తీసుకోకుండా మంత్రి సమయం ఇవ్వడం లేదంటూ విమర్శలు చేయడం సరికాదని నాగన్న గౌడ్ అన్నారు.

రూ.300 కమిషన్ అడిగితే రూ.70 మాత్రమే పెంచారు

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రేషన్ డీలర్లు తమ సమస్యల పరిష్కారం కోసం పలుమార్లు ఆందోళనలు చేసినా తగిన స్పందన లభించలేదని నాగన్న గౌడ్ ఆరోపించారు.



డీలర్లు రూ.300 కమిషన్ పెంపును కోరగా, అప్పట్లో కేవలం రూ.70 మాత్రమే పెంచి ప్రభుత్వం చేతులు దులుపుకుందని విమర్శించారు. అప్పటి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సైతం డీలర్ల సమస్యలపై ప్రశ్నించిన విషయాన్ని గుర్తుచేశారు.రేషన్ డీలర్లకు గౌరవప్రదమైన జీవనోపాధి కల్పించేందుకు వారి సమస్యలను పరిష్కరించాలని, కమిషన్ పెంపుపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని నాగన్న గౌడ్ కోరారు.

పలువురు యూనియన్ నాయకుల హాజరు

ఈ సమావేశంలో రాష్ట్ర డీలర్ల యూనియన్ ఉపాధ్యక్షుడు ఎస్‌డీ అజ్మతుల్లా, ప్రధాన కార్యదర్శి గుండు గురవయ్య, నాయకులు రాగం లింగయ్య, మామిడి కాశయ్య, పేరబోయిన వెంకటేశ్వర్లు, అర్వపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

హనుమకొండ జిల్లాలోని 14 మండలాలూ కరువు ప్రాంతాలుగా ప్రకటన!

- **ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితులు.. కరువు మండలాలుగా ప్రకటిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు**
- **రైతులకు రుణాల రీషెడ్యూల్, పంట నష్టపరిహారం, ఉపాధి హామీ పనులపై దృష్టి**

హనుమకొండ, అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):

ఖరీఫ్ సీజన్‌లో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో హనుమకొండ జిల్లాలోని మొత్తం 14 మండలాలను కరువు మండలాలుగా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. వర్షాలు లేక పంటలు దెబ్బతినడంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంటున్నారు.జిల్లాలోని వేలేరు, ఎల్కతుర్తి, కమలాపూర్, హసన్‌పర్తి, భీమదేవరపల్లి, ధర్మసాగర్, నడికూడ మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించినట్లు కథనంలో పేర్కొన్నారు.

రైతులకు ఊరట కల్పించే చర్యలపై దృష్టి

కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులకు అండగా నిలిచేందుకు పంట నష్టపరిహారం, రుణాల రీషెడ్యూల్ వంటి చర్యలు చేపట్టాలని, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులను ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్‌కు ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం.వర్షాభావంతో పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వ సహాయం ఎప్పుడు, ఏ విధంగా అందుతుందనే అంశంపై అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు. కరువు పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.



ఓటు హక్కు పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి: ఎమ్మెల్సీ దండే విఠల్

సంఘటన్ శ్రీజన్ అభియాన్‌లో ఓటు హక్కుపై చర్చ..

ఆసిఫాబాద్, అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):



ప్రజాస్వామ్య పరిరక్షణకు, రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ దండే విఠల్ పిలుపునిచ్చారు. ఆసిఫాబాద్‌లో నిర్వహించిన సంఘటన్ శ్రీజన్ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. బీజేపీ ఓట్ల దొంగతనం ద్వారా అధికారంలోకి వస్తోందని ఆరోపించారు. ఎస్ఐఆర్ (SIR) ప్రక్రియ ద్వారా ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారని విమర్శించారు.డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ప్రజలకు కల్పించిన ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాది అని పేర్కొన్నారు. ఓటు హక్కుకు భంగం కలగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఓటర్ల జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు.ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ప్రజలు చైతన్యంతో ముందుకు రావాలని ఎమ్మెల్సీ దండే విఠల్ పిలుపునిచ్చారు.

పద్మల్ పూరి కాకో ఎత్మసార్ దేవత ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

- **ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరంద చేతుల మీదుగా పోస్టర్ విడుదల**
- **నవంబర్ 1 నుంచి 12 వరకు గుస్సాడి--దండారి ఉత్సవాలు.. 5న పద్మల్ పూరి కాకో దేవస్థానంలో దర్బార్**

ఉట్నూర్, అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):



గోండ్వానా భూభాగంలో ఆదివాసీల సంప్రదాయాలు, సంస్కృతి, ఆచారాలకు ప్రతీకగా నిలిచే పద్మల్ పూరి కాకో ఎత్మసార్ దేవత ఉత్సవాల పోస్టర్‌ను ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరంద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నవంబర్ 1 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న గుస్సాడి--దండారి ఉత్సవాల వివరాలను నిర్వాహకులు వెల్లడించారు.నవంబర్ 5వ తేదీ గురువారం పద్మల్ పూరి కాకో దేవస్థానంలో దర్బార్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవాలకు ఆదివాసీ ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా నిర్వహించే ఈ ఉత్సవాలు గిరిజన సమాజ ఐక్యతను చాటిచెప్పే వేదికగా నిలుస్తాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పద్మల్ పూరి కాకో వైస్ చైర్మన్ కుమ్ర లింగ్రావు, రాజ్ గోండు సేవా సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగం విషంరావు, రాష్ట్ర నాయకులు తొడాసం భీంరావు, నిర్మల్ జిల్లా అధ్యక్షులు ఆత్రం రాజేశ్వర్, రాజ్ విద్యార్థి సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షులు ఆత్రం భగవంత్ రావు, పెంధోర్ శ్రీనివాస్, ఆదివాసీ సేన మండల అధ్యక్షులు ఆత్రం జలపాత్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

కుంరం సూరు 29వ వర్ధంతి సభకు రావాలని డీసీసీ అధ్యక్షురాలికి ఆహ్వానం

- **ఆదివాసీ కొలాం వీరరత్నం సేవలు చిరస్మరణీయం: ఆత్రం సుగుణక్క**

ఆసిఫాబాద్, అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):



ఆదివాసీ కొలాం వీరరత్నం, అమరజీవి కుంరం సూరు 29వ వర్ధంతి సభకు హాజరుకావాలని కోరుతూ వర్ధంతి నిర్వహణ కమిటీ సభ్యులు కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్కకు ఆహ్వాన పత్రిక అందజేశారు.ఈ నెల 29వ తేదీ గురువారం ఆసిఫాబాద్ మండలంలోని అంకుసాపూర్ ఆదివాసీ రవిచంద్ర నగర్‌లో కుంరం సూరు 29వ వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆత్రం సుగుణక్క మాట్లాడుతూ.. ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం పోరాడిన కొలాం వీరరత్నం కుంరం సూరు సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను స్మరించుకుంటూ వర్ధంతి సభకు ఆదివాసీలు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఘనంగా నివాళులర్పించాలని పిలుపునిచ్చారు.పలువురు నాయకుల హాజరుఈ కార్యక్రమంలో కుంరం సూరు వర్ధంతి నిర్వహణ కమిటీ చైర్మన్ ఆత్రం భీము, పీవీటీజీ రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భీమ్ రావు, కొలాం సంఘం జిల్లా అధ్యక్షుడు ఆత్రం తిరుపతి, వావుదాం ఉపసర్పంచ్ ఆత్రం అనిల్, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ తారీఖ్, ఆసిఫాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాపర్తి మురళి, కిరిమేరి మండల అధ్యక్షుడు సుజాయిత్ ఖాన్, ఆర్జీపీఆర్ఎస్ ఇందిరాబాయి, మాజీ ఎంపీటీసీ సిదం తిరుపతి, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ కోఆర్డినేటర్ సాయికుమార్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బాలు యాదవ్, ఆత్రం కట్టి, ఆత్రం గంగారాం తదితరులు పాల్గొన్నారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

ఎస్‌జీఎఫ్‌ఐ కరాటే పోటీల్లో ముల్కనూరు విద్యార్థినికి బంగారు పతకం

- **రాష్ట్రస్థాయి పోటీలకు గొల్లెన శ్రీనిధి ఎంపిక.. కోచ్‌లు, ఉపాధ్యాయుల అభినందనలు**

భీమదేవరపల్లి, అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):



ఎస్‌జీఎఫ్‌ఐ (SGFI) ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి కరాటే పోటీల్లో ముల్కనూరుకు చెందిన విద్యార్థిని గొల్లెన శ్రీనిధి సత్తా చాటింది. అక్టోబర్ 27న నర్సంపేటలో నిర్వహించిన పోటీల్లో హనుమకొండ జిల్లా తరఫున అండర్-17, 45 కేజీల విభాగంలో బరిలోకి దిగిన శ్రీనిధి ప్రథమ స్థానం సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ విజయంతో నవంబర్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్‌ఐ కరాటే పోటీలకు ఎంపికైంది.

రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొన్న ఈ పోటీల్లో శ్రీనిధి స్వర్ణ పతకం సాధించడం పట్ల గ్రాండ్ మాస్టర్ సిరిగిరి తిరుపతి, కోచ్ సిరిగిరి సాంబశివ హర్షం వ్యక్తం చేశారు. శ్రీనిధి పట్టుదల, క్రీడా నైపుణ్యాన్ని అభినందిస్తూ రాష్ట్రస్థాయి పోటీల్లోనూ అద్భుత ప్రదర్శన చేసి విజయం సాధించాలని ఆకాంక్షించారు.

పాఠశాల బృందం అభినందనలు

ముల్కనూరు మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు మహమ్మద్ రెహమాన్‌తో పాటు ఉపాధ్యాయ బృందం విద్యార్థిని శ్రీనిధిని, కోచ్ సిరిగిరి సాంబశివను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. శ్రీనిధి సాధించిన విజయంపై ఆమె తల్లిదండ్రులు సైతం హర్షం వ్యక్తం చేశారు. ముల్కనూరు విద్యార్థిని సాధించిన ఈ విజయం స్థానికంగా ఆనందాన్ని నింపింది. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ శ్రీనిధి పతకం సాధించి గ్రామానికి, పాఠశాలకు మరింత పేరు తీసుకురావాలని పలువురు ఆకాంక్షించారు.

నలుగురు ఏఆర్ కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి

- **ప్రమోషన్ ఉత్తర్వులు అందజేసి మిఠాయిలు పంచిన ఎస్పీ కె.నరసింహ ఐపీఎస్**
- **ప్రజలకు మెరుగైన సేవలందించి పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలి: ఎస్పీ**

సూర్యాపేట, అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):



సూర్యాపేట జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న నలుగురు కానిస్టేబుళ్లు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందారు. రాంబాబు, రామారావు, అశోక్, బషీర్‌లకు ఉద్యోగోన్నతి లభించడంతో జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.నరసింహ ఐపీఎస్ పదోన్నతి ఉత్తర్వులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంచి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

పదోన్నతితో బాధ్యతలు మరింత పెరుగుతాయి

ఈ సందర్భంగా ఎస్పీ కె.నరసింహ మాట్లాడుతూ.. పదోన్నతి అనేది బాధ్యతలను మరింత పెంచుతుందని, కొత్త హోదాకు తగిన విధంగా క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందిస్తూ వారి నమ్మకాన్ని పొందాలని, పోలీసు శాఖ ప్రతిష్ఠను మరింత పెంచేలా పనిచేయాలని ఆకాంక్షించారు.విధి నిర్వహణలో అప్రమత్తత, నిబద్ధతకు ప్రాధాన్యం ఇవ్వాలని, తోటి సిబ్బందితో గౌరవంగా మెలుగుతూ సమన్వయంతో ముందుకు సాగాలని తెలిపారు. విధులతో పాటు ఆరోగ్యం, కుటుంబ సంక్షేమంపై కూడా శ్రద్ధ వహించాలని సూచించారు.

అధికారుల అభినందనలు

పదోన్నతి పొందిన సిబ్బందిని పలువురు పోలీసు అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, ఆర్మ్‌డ్ డీఎస్పీ నరసింహాచారి, ఆర్ఐ ప్రవీణ్ కుమార్, పోలీసు సంఘం అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి కిరణ్‌తో పాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వరకు ఉచిత వైద్యం

- **పీఎం రహత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి: ఎస్పీ నరసింహ ఐపీఎస్**
- **సూర్యాపేట జిల్లాలో 38 ఆసుపత్రుల్లో వైద్య సేవలు.. అత్యవసర వేళ 112కు కాల్ చేయండి**

సూర్యాపేట, అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):

రోడ్డు ప్రమాద బాధితుల ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం రహత్ (PM RAHAT) పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ ఐపీఎస్ సూచించారు. ఈ పథకం కింద అర్హత నిబంధనలకు అనుగుణంగా గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు, ఏడు రోజుల పాటు నగదు రహిత వైద్య చికిత్స పొందవచ్చని తెలిపారు. జిల్లాలో 38 ఆసుపత్రులను ఈ పథకం కింద ఎంపిక చేసినట్లు వెల్లడించారు.

ప్రమాదం జరిగిన వెంటనే స్పందించాలి

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి సకాలంలో వైద్యం అందించడం ప్రాణాలను కాపాడటంలో కీలకమని ఎస్పీ పేర్కొన్నారు. క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించేందుకు సహకరించాలని, అత్యవసర పరిస్థితుల్లో 112కు ఫోన్ చేసి పోలీసుల సహాయం పొందాలని ప్రజలకు సూచించారు. ప్రమాద బాధితులను ఆదుకోవడంలో నిర్లక్ష్యం చేయవద్దని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలే ప్రాణరక్షణ

ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్పీ సూచించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లలో ప్రయాణించేవారు సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని తెలిపారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండాలని కోరారు.రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకోవడంతో పాటు ప్రమాద బాధితులకు తక్షణ సహాయం అందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఎస్పీ నరసింహ పిలుపునిచ్చారు.

వరంగల్ ఎంజీఎంలో వైద్యులకు ఉద్యోగావకాశాలు.. 16 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ!

- **నవంబర్ 2న వాక్-ఇన్ ఇంటర్వ్యూలు.. కాంట్రాక్ట్ ప్రాతిపదికన నియామకాలు**
- **ఎమర్జెన్సీ మెడిసిన్‌లో అత్యధికంగా 7 పోస్టులు.. అర్హులైన వైద్యులకు అవకాశం**

హనుమకొండ, అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):



వైద్య రంగంలో ఉద్యోగావకాశాల కోసం ఎదురుచూస్తున్న వైద్యులకు వరంగల్‌లోని ఎంజీఎం (వీ+వీ) ఆసుపత్రి శుభవార్త అందించింది. ఆసుపత్రిలో వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 16 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు. ఈ నియామకాల కోసం నవంబర్ 2న వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ వెల్లడించారు.

ఆరు విభాగాల్లో ఖాళీలు

నియామకాల్లో భాగంగా ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగంలో 7 పోస్టులు, ఆర్థోపెడిక్స్‌లో 4, రేడియాలజీలో 2 పోస్టులు ఉన్నాయి. పీడియాట్రిక్స్, కార్డియాలజీ, న్యూరో సర్జరీ విభాగాల్లో ఒక్కో పోస్టును భర్తీ చేయనున్నారు. మొత్తం 16 పోస్టుల ద్వారా అర్హులైన వైద్యులకు అవకాశం కల్పించనున్నారు.

నవంబర్ 2న ఇంటర్వ్యూలు

వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నవంబర్ 2వ తేదీన ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి కాన్ఫరెన్స్ హాల్‌లో జరగనున్నాయి. అర్హత కలిగిన అభ్యర్థులు తమ విద్యార్హతలు, అనుభవానికి సంబంధించిన ధ్రువపత్రాలు, ఇతర అవసరమైన పత్రాలతో నేరుగా హాజరుకావాలని అధికారులు సూచించారు.

అభ్యర్థులు గమనించాల్సినవి

నియామకాలు కాంట్రాక్ట్ ప్రాతిపదికన చేపడుతున్నందున, సంబంధిత విభాగాల అర్హతలు, వేతనం, వయోపరిమితి, అవసరమైన ధ్రువపత్రాలు తదితర వివరాలను అధికారిక నోటిఫికేషన్‌లో పరిశీలించాలి. ఇంటర్వ్యూకు హాజరయ్యే ముందు నియామక నిబంధనలను నిర్ధారించుకోవాలని సూచించారు.

అర్నబ్ తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండండి.. ములుగు అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు!

- **భారీ ఈదురుగాలుల నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టాలి**
- **ప్రజలు జాగ్రత్తలు పాటించాలి.. క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి**

ములుగు, అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):



అర్నబ్ తుఫాన్ ప్రభావంతో భారీ ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో ములుగు జిల్లా అధికారులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క అప్రమత్తం చేశారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

క్షేత్రస్థాయిలో అధికారులు అందుబాటులో ఉండాలి

తుఫాన్ ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని మంత్రి సూచించారు. ప్రజలకు అవసరమైన హెచ్చరికలు, సూచనలు ఎప్పటికప్పుడు చేరవేయాలని, ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తితే వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

భారీ ఈదురుగాలులు వీచే సమయంలో ప్రజలు చెట్లు, విద్యుత్ స్తంభాలు, శిథిలావస్థలో ఉన్న భవనాల సమీపంలో ఉండకూడదని మంత్రి సీతక్క సూచించారు. అవసరమైతే తప్ప బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని, అధికారుల సూచనలను అనుసరించాలని కోరారు.ప్రజల భద్రతకు ప్రాధాన్యమిస్తూ, పరిస్థితులకు అనుగుణంగా తక్షణ సహాయక చర్యలు అందించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని మంత్రి ఆదేశించారు.

ఖర్గే వ్యాఖ్యలకు నిరసనగా బీజేపీ ఆందోళన

- **సూర్యాపేటలో దిష్టిబొమ్మ దహనం.. బేషరతుగా క్షమాపణ చెప్పాలని చల్ల శ్రీలతారెడ్డి డిమాండ్**

సూర్యాపేట, ప్రజానేస్తం జ్వాల:

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కుటుంబం గురించి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సూర్యాపేట జిల్లా కేంద్రంలో బీజేపీ నాయకులు ఆందోళన చేపట్టారు. బీజేపీ సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలతారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో ఖర్గే దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసన వ్యక్తం చేశారు.

రాజకీయ విమర్శలు హుందాగా ఉండాలి

ఈ సందర్భంగా చల్ల శ్రీలతారెడ్డి మాట్లాడుతూ.. రాజకీయాల్లో విమర్శలు, సిద్ధాంతపరమైన భిన్నాభిప్రాయాలు సహజమేనని, అయితే విమర్శలు వ్యక్తిగత కుటుంబాల ప్రస్తావనకు వెళ్లడం సమంజసం కాదని అన్నారు. రాజకీయాల్లో వ్యక్తిగత కుటుంబాలను లక్ష్యంగా చేసుకునే వ్యాఖ్యలు ప్రజాస్వామ్య సంప్రదాయాలకు విరుద్ధమని అభిప్రాయపడ్డారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కుటుంబంపై చేసిన వ్యాఖ్యలకు సంబంధించి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ దేశ ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు.

బీజేపీ నాయకుల పాల్గొనడం

ఈ నిరసన కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫణి నాయుడు, పట్టణ అధ్యక్షులు రమేష్, మల్సూర్, టీచర్ సెల్ కో-కన్వీనర్ సాయిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు పాండురంగాచారి, ఓఎస్ రవివర్మ, జిల్లా బీజేవైఎం అధ్యక్షుడు పృథ్వీ, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పరశురామ్, కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి సోమయ్య, ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి వెంకన్న, ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి రవి, బీజేపీ నాయకులు బాలాజీ నాయక్, నరసింహతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏనుమాముల మార్కెట్లో పత్తికి స్వల్పంగా పెరిగిన ధర!

- **వండర్‌హాట్, 341 మిర్చి రకాల ధరల్లో తగ్గుదల.. టమాటా మిర్చి క్వింటా రూ.38 వేలు**

హనుమకొండ, అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):



వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో బుధవారం వ్యవసాయ ఉత్పత్తుల ధరల్లో స్వల్ప హెచ్చుతగ్గులు నమోదయ్యాయి. పత్తి ధర క్వింటాకు రూ.9,100 పలికి, మంగళవారం ధర రూ.9,070తో పోలిస్తే రూ.30 పెరిగింది.తేజ మిర్చి ధర రూ.23,300 వద్ద స్థిరంగా ఉండగా, 341 రకం మిర్చి రూ.26,300, వండర్‌హాట్ మిర్చి రూ.30,500 పలికాయి. టమాటా మిర్చి ధర మాత్రం క్వింటాకు రూ.38,000 వద్ద కొనసాగింది.

పోలీసు అమరవీరుల త్యాగాలకు సలాం!

- **తొర్రూరులో ఘనంగా సైకిల్ ర్యాలీ.. అమరవీరుల సేవలను స్మరించుకున్న పోలీసు అధికారులు**
- **డీఎస్పీ కృష్ణ కిషోర్, సీఐ గణేష్ ఆధ్వర్యంలో అమరవీరుల వారోత్సవాల కార్యక్రమం**



తొర్రూరు (ప్రజానేస్తం జ్వాల):

దేశ రక్షణ, ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా తొర్రూరు పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో డీఎస్పీ కృష్ణ కిషోర్, సీఐ గణేష్, సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. అమరవీరుల త్యాగాలు తరతరాలకు స్ఫూర్తి ఈ సందర్భంగా డీఎస్పీ కృష్ణ కిషోర్ మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు ఎప్పటికీ మరువలేనివని పేర్కొన్నారు. వారి త్యాగాలను స్మరించుకోవడంతో పాటు పోలీసు శాఖ సేవలు, బాధ్యతలు, ప్రజల రక్షణలో పోలీసులు అందిస్తున్న సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ర్యాలీ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పోలీసు అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్న ఈ సైకిల్ ర్యాలీ ద్వారా అమరవీరుల త్యాగాలను గుర్తుచేసుకుంటూ వారికి ఘన నివాళులర్పించారు.

రేషన్ కార్డుదారులకు సంక్రాంతి కానుక?

- **బియ్యంతో పాటు మరో 6 సరుకుల పంపిణీకి కసరత్తు!**

హనుమకొండ, అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):

తెల్ల రేషన్ కార్డుదారులకు సంక్రాంతి నాటికి అదనపు ప్రయోజనాలు అందించేందుకు ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. బియ్యంతో పాటు కందిపప్పు, పామాయిల్, చింతపండు, కారంపొడి, చక్కెర, గోధుమపిండిని సబ్సిడీపై పంపిణీ చేసే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఏయే సరుకులను ఎంత పరిమాణంలో, ఏ ధరలకు అందించాలనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. అయితే, ఈ ప్రతిపాదనపై ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. సంక్రాంతి నుంచే పంపిణీ ప్రారంభమవుతుందన్నది ఇంకా ఖరారు కాలేదు.



ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

ప్రజల చెంతకే న్యాయం.. సంచార లోక్ అదాలత్‌కు శ్రీకారం!





- **హనుమకొండలో మొబైల్ న్యాయ సేవల వాహనం ప్రారంభం**
- **మారుమూల గ్రామాల ప్రజలకు ఉచిత న్యాయ సలహాలు.. జాతీయ లీగల్ ఎయిడ్ హెల్ప్‌లైన్ 15100పై అవగాహన**

హనుమకొండ, అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి:):

కోర్టుల చుట్టూ తిరిగే ఇబ్బందులు లేకుండా పేద, సామాన్య ప్రజలకు న్యాయ సేవలను వారి ముంగిటకే చేరవేసే లక్ష్యంతో హనుమకొండలో 'సంచార లోక్ అదాలత్ -- ఉచిత న్యాయ సేవలు' వాహనాన్ని ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (ుూూూా), జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (ఱూూూా) సంయుక్త ఆధ్వర్యంలో రూపొందించిన ఈ ప్రత్యేక వాహనాన్ని బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పూలమాల వేసి, కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.

మారుమూల ప్రాంతాలకూ న్యాయ సేవలు

'ప్రజల ముంగిట న్యాయం -- జీబర్అఎవ ఖ్ాశీబతీ ణశీశీతీర్వజూ' నినాదంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. గ్రామీణ, ఏజెన్సీ, మారుమూల ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఉచిత న్యాయ సేవలపై అవగాహన కల్పించడంతో పాటు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా న్యాయ సహాయం పొందలేని వారికి అవసరమైన సలహాలు అందించనున్నట్లు వివరించారు.పరిష్కారానికి అవకాశం ఉన్న వివాదాల్లో ముందస్తు న్యాయ సహాయం, పరస్పర రాజీ ద్వారా కేసుల పరిష్కారంపై ప్రజలకు మార్గనిర్దేశం చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన వారికి ఉచిత న్యాయ సహాయ సేవల గురించి వివరించి, న్యాయ సేవలను మరింత చేరువ చేయడమే ఈ వాహనం ప్రధాన లక్ష్యమని తెలిపారు.

ఆధునిక సాంకేతిక సదుపాయాలతో వాహనం

సంచార వాహనంలో డిజిటల్ స్క్రీన్లు, ఆధునిక సౌండ్ సిస్టమ్‌తో పాటు అవసరమైన సాంకేతిక పరికరాలను ఏర్పాటు చేశారు. వీటి ద్వారా జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (NALSA), తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ (ుూూూా) పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు.

ఉచిత న్యాయ సహాయం అవసరమైన వారు 15100 జాతీయ న్యాయ సేవల టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా కూడా సమాచారం పొందవచ్చని అధికారులు సూచించారు.

న్యాయ సేవాధికారుల హాజరు

ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, అదనపు జిల్లా న్యాయమూర్తులు, సీనియర్, జూనియర్ సివిల్ న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు, ప్రతినిధులు, సీనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.మొత్తంగా, సంచార లోక్ అదాలత్ ద్వారా న్యాయ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, ఉచిత న్యాయ సహాయంపై అవగాహన పెంపొందించేందుకు అవకాశం ఏర్పడనుంది.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

- **15 రోజులుగా నిరవధిక సమ్మె.. ఉద్యోగులకు సంఘీభావంగా దీక్షలో కూర్చున్న ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్‌బాబు**
- **శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో సమస్యను ప్రస్తావిస్తాం.. ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం**

ఆసిఫాబాద్, అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):

జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) ఉద్యోగులను క్రమబద్ధీకరించి, వారి దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్‌బాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాంప్లెక్స్ ఎదుట గత 15 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు ఆయన సంఘీభావం ప్రకటించి, వారి దీక్షలో పాల్గొన్నారు.

20 ఏళ్లుగా సేవలు.. ఉద్యోగులకు భరోసా కల్పించాలి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీష్‌బాబు మాట్లాడుతూ.. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు గత 20 ఏళ్లుగా వైద్య ఆరోగ్య శాఖలో కీలక సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం గుర్తించి, వారికి న్యాయం చేయాలని కోరారు. దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

అసెంబ్లీలో సమస్యను ప్రస్తావిస్తాం

రాబోయే శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యను



ప్రస్తావిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. దేశంలోని ఏడు రాష్ట్రాల్లో ఉద్యోగుల క్రమబద్ధీకరణకు అనుసరించిన విధానాలను పరిశీలించి, తెలంగాణలోనూ అర్హులైన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు న్యాయం జరిగేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని హామీ ఇచ్చారు.ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని, సమస్యకు పరిష్కారం చూపాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అరిగెల నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్, ఆసిఫాబాద్ పట్టణ అధ్యక్షుడు ఆకుల సంతోష్‌కుమార్‌తో పాటు పెద్ద సంఖ్యలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల డిమాండ్లకు మద్దతు తెలపండి

- **మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు ఎన్‌హెచ్‌ఎం జేఏసీ వినతి**
- **ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం, క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి**

ఆసిఫాబాద్, అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):

జాతీయ ఆరోగ్య మిషన్ (NHM) ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి మద్దతు తెలపాలని సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ఎన్‌హెచ్‌ఎం జాయింట్ యాక్షన్ కమిటీ (JAC) ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, తమ డిమాండ్లను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ఉద్యోగుల ప్రధాన డిమాండ్లు ఇవే..

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, నర్సింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని జేఏసీ ప్రతినిధులు కోరారు. 2022 నుంచి 5 శాతం ఇంక్రిమెంట్, 8 శాతం రౌండింగ్ బోనస్ మంజూరు చేయాలని, ఉద్యోగుల వేతనాలను స్టేట్ హెల్త్ సొసైటీ (ుూూా) ద్వారా నేరుగా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.ఇతర ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు మాదిరిగా కేడర్‌తో సంబంధం లేకుండా 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు కల్పించాలని కోరారు. విధి నిర్వహణలో ఉండగా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగి మరణిస్తే కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించడంతో పాటు, అర్హతల ఆధారంగా కుటుంబ సభ్యులకు ఉద్యోగావకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

వేతన బకాయిలు విడుదల చేయాలి

ప్రతి ఉద్యోగికి ఉద్యోగ భద్రతతో పాటు ఈహెచ్‌ఎస్/ఈఎస్ఐ వైద్య సదుపాయాలు కల్పించాలని, ప్రతి నెలా ఐదో తేదీలోపు వేతనాలు చెల్లించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న తొమ్మిది నెలల పీఆర్‌సీ బకాయిలు, ఇతర ఏరియర్స్‌ను విడుదల చేయాలని, జీఓ నంబర్ 60, 1195 ప్రకారం పెంచిన వేతనాలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఉద్యోగుల సమస్యలను పరిష్కరించి, వారి సేవలను గుర్తిస్తూ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని జేఏసీ ప్రతినిధులు కోరారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని విజ్ఞప్తి

గతంలో బోదకాలు వ్యాధితో బాధపడుతున్న వారికి పింఛన్లు మంజూరు కావడంలో కోనేరు కోనప్ప కీలక పాత్ర పోషించారని జేఏసీ ప్రతినిధులు ఈ సందర్భంగా గుర్తుచేశారు. అదే విధంగా ప్రస్తుతం ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కూడా మద్దతు తెలిపి, ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు.ఉద్యోగ భద్రత, మెరుగైన వేతనాలు, వైద్య సదుపాయాలు కల్పించేలా ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని ఎన్‌హెచ్‌ఎం జేఏసీ సభ్యులు కోరారు.



ఫిజియోథెరపీపై అపోహలు వీడండి.. ప్రయోజనాలు పొందండి!

- **డాక్టర్ రాకేష్ గుండు పిలుపు.. ముల్కనూర్‌లో మెగా ఫిజియోథెరపీ వైద్య శిబిరం**

ముల్కనూర్, అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):



ఫిజియోథెరపీపై ప్రజలు అపోహలు వీడి, దాని ప్రయోజనాలపై అవగాహన పెంచుకోవాలని డాక్టర్ రాకేష్ గుండు సూచించారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ గ్రామపంచాయతీ ఆవరణలో బుధవారం ఇండియన్ మెడికల్ షాప్ ఆధ్వర్యంలో మెగా ఫిజియోథెరపీ వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి శిబిరాన్ని ప్రారంభించారు.

శారీరక సమస్యల ఉపశమనానికి ఫిజియోథెరపీ

శిబిరంలో ఫిజియోథెరపీ చికిత్సకు ఉపయోగించే వివిధ పరికరాలను ప్రదర్శించి, వాటి వినియోగం, చికిత్సా విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఫిజియోథెరపీ ద్వారా పలు శారీరక సమస్యల నిర్వహణలో సహాయం పొందడంతో పాటు కదలికలు, శారీరక సామర్థ్యాన్ని మెరుగుపరుచుకునే అవకాశం ఉంటుందని వైద్యులు వివరించారు.ఫిజియోథెరపీ అనేది కేవలం నొప్పి తగ్గించుకునే చికిత్స మాత్రమే కాదని, వ్యక్తి శారీరక చలనశీలతను మెరుగుపరచడంలోనూ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. సమస్యకు అనుగుణంగా అర్హత కలిగిన వైద్య నిపుణుల సూచనల మేరకు చికిత్స తీసుకోవాలని సూచించారు.

ప్రజలకు వైద్య అవగాహన

ఫిజియోథెరపీపై సరైన అవగాహన పెంపొందించుకోవడం ద్వారా ప్రజలు తగిన చికిత్సను ఎంచుకోవచ్చని నిర్వాహకులు పేర్కొన్నారు. శిబిరం ద్వారా ప్రజలకు చికిత్సా విధానాలపై అవగాహన కల్పించారు.

ఉమ్మడి వరంగల్‌లో కరువు ఛాయలు!

- **6 జిల్లాల్లో 42 మండలాలు కరువు జాబితాలోకి?**
- **రాష్ట్రవ్యాప్తంగా 365 మండలాల గుర్తింపునకు సంబంధించిన వివరాలు.. అధికారిక ఉత్తర్వులపై స్పష్టత అవసరం**

హనుమకొండ, అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):



ఉమ్మడి వరంగల్ జిల్లాను కరువు పరిస్థితులు ఆందోళనకు గురిచేస్తున్నాయి. వర్షాభావ ప్రభావంతో వ్యవసాయ రంగంపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో, ఉమ్మడి జిల్లాలోని ఆరు జిల్లాలకు చెందిన 42 మండలాలు కరువు జాబితాలో ఉన్నట్లు సమాచారం వెలువడింది. రాష్ట్రవ్యాప్తంగా 31 జిల్లాల్లో 365 మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించినట్లు ప్రచారం జరుగుతోంది.

జిల్లాల వారీగా ఇలా..

అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం హనుమకొండ జిల్లాలో 14, మహబూబాబాద్‌లో 7, వరంగల్‌లో 8, జయశంకర్ భూపాలపల్లిలో 5, జనగామలో 4, ములుగు జిల్లాలో 4 మండలాలు ఉన్నట్లు పేర్కొంటున్నారు. ఈ సంఖ్యల ప్రకారం ఉమ్మడి వరంగల్ పరిధిలో మొత్తం 42 మండలాలు అవుతున్నాయి.

రైతుల్లో నెలకొన్న ఆందోళన

కరువు పరిస్థితులు నెలకొంటే పంటల సాగు, దిగుబడులు, రైతుల ఆదాయంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో వర్షపాతం, పంటల పరిస్థితులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, అర్హులైన రైతులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం సహాయం అందించాల్సిన అవసరం ఉంది.

గ్లోబల్ సమ్మిట్‌లో తెలంగాణ చారిత్రక వైభవం!

- **కాకతీయ కళాతోరణం, రామప్ప డిజైన్లకు ప్రాధాన్యం ఇవ్వండి**
- **అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు**

హనుమకొండ, అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):



తెలంగాణ సంస్కృతి, చారిత్రక వారసత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' ఏర్పాట్లు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సమ్మిట్ ప్రాంగణంలో రాష్ట్ర చారిత్రక వైభవం ప్రతిబింబించేలా ప్రత్యేక డిజైన్లు రూపొందించాలని సూచించారు.సమ్మిట్ సన్నాహకాలపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి కీలక సూచనలు చేశారు. ఈ నెల 29న దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించనున్న కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అవసరమైన ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ప్రపంచానికి తెలంగాణ వారసత్వపు వైభవం

తెలంగాణ చరిత్ర, కళా వైభవానికి ప్రతీకలైన కాకతీయ కళాతోరణం, రామప్ప ఆలయ నిర్మాణ శైలులకు సమ్మిట్‌లో ప్రత్యేక ప్రాధాన్యం కల్పించాలని సీఎం స్పష్టం చేశారు. ఈ చారిత్రక కట్టడాల స్ఫూర్తితో రూపొందించే డిజైన్లు రాష్ట్ర ప్రత్యేకతను, సాంస్కృతిక గొప్పతనాన్ని అంతర్జాతీయ పెట్టుబడిదారులకు పరిచయం చేసేలా ఉండాలని సూచించారు. పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్‌ను తెలంగాణ అభివృద్ధితో పాటు రాష్ట్ర చారిత్రక, సాంస్కృతిక గుర్తింపును ప్రపంచ వేదికపై చాటిచెప్పే అవకాశంగా వినియోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

ఏనుమాముల మార్కెట్లో మొక్కజొన్నకు రికార్డు ధర!

- **క్వింటాలుకు రూ.3,115.. రైతుల్లో ఆనందం**

హనుమకొండ, అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):



వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో మొక్కజొన్న ధర సరికొత్త రికార్డు సృష్టించింది. బుధవారం క్వింటాలు మొక్కజొన్న గరిష్ఠంగా రూ.3,115 పలికినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి.గత నెలలో క్వింటాలు ధర రూ.2,560 వరకు ఉండగా, నెల రోజుల్లోనే గణనీయంగా పెరగడం రైతుల్లో ఆశలు పెంచింది. మార్కెట్లో లభించిన ధరతో మొక్కజొన్న రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజానేస్తం జ్వాల
నిజం కోసం... నిర్భయంగా...
www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

ఆర్నబ్ తుఫానుపై అప్రమత్తంగా ఉండండి.. ప్రజలకు ఎస్పీ హెచ్చరిక!

సూర్యాపేట జిల్లాకు ఆరెంజ్ అలర్ట్.. భారీ నుంచి అతి భారీ వర్షాల ముప్పు

రైతులు ధాన్యాన్ని కాపాడుకోవాలి.. వరి కోతలు వాయిదా వేసుకోవాలి

వాగులు, వంకలు, వరద ప్రవాహాల వద్దకు వెళ్లొద్దు

అత్యవసర పరిస్థితుల్లో డయల్ 112కు ఫోన్ చేయండి



సూర్యాపేట జిల్లా, అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):

ఆర్నబ్ తుఫాను నేపథ్యంలో సూర్యాపేట జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ అయినట్లు పేర్కొంటూ, భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ కె. నరసింహ, ఐపీఎస్ సూచించారు. వర్షాల కారణంగా ప్రమాదాలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

రైతులు అప్రమత్తం.. ధాన్యాన్ని కాపాడుకోండి

రైతులు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ వరి కోతలను వీలైనంతవరకు వాయిదా వేసుకోవాలని, ఇప్పటికే కోసిన ధాన్యం వర్షానికి తడవకుండా టార్పాలిన్ కవర్లతో కప్పి భద్రపరచుకోవాలని ఎస్పీ సూచించారు.

వాహనదారులు జాగ్రత్త.. అత్యవసరమైతేనే ప్రయాణం

భారీ వర్షాల సమయంలో రహదారులపై నీరు నిలిచే అవకాశం ఉన్నందున వాహనదారులు నెమ్మదిగా, అప్రమత్తంగా ప్రయాణించాలని కోరారు. అత్యవసరం కాని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, విద్యార్థులు, పాఠశాల వాహనాల డ్రైవర్లు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

విద్యుత్ ప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరం

విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలని, తెగిపడిన విద్యుత్ తీగలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకరాదని హెచ్చరించారు. వాగులు, వంకలు, చెరువులు, వరద నీటి ప్రవాహాల వద్దకు వెళ్లడం, నీటిని దాటేందుకు ప్రయత్నించడం ప్రమాదకరమని తెలిపారు. అధికారుల సూచనలు పాటించాలి వాతావరణ హెచ్చరికలు, పోలీసు, సంబంధిత అధికారుల సూచనలను ప్రజలు తప్పనిసరిగా పాటించాలని ఎస్పీ కోరారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసుల సహాయం కోసం డయల్ 112కు కాల్ చేయాలని సూచించారు. ప్రజల భద్రతే ప్రథమ లక్ష్యం.. అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ సాధ్యం.

కేయూ ప్రొఫెసర్‌కు జాతీయ పురస్కారం!

'భేషజ్ శిక్షా రత్న--2026' అందుకున్న వై. నరసింహారెడ్డి

హనుమకొండ, అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):



కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ) ఫార్మాస్యూటికల్ సైన్సెస్ సీనియర్ ప్రొఫెసర్ వై. నరసింహారెడ్డికి జాతీయ స్థాయి 'భేషజ్ శిక్షా రత్న--2026' పురస్కారం లభించింది. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (PCI) అందించిన ఈ అవార్డును అక్టోబర్ 26న న్యూఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఆయన స్వీకరించారు. ఫార్మసీ విద్యారంగంలో 30 ఏళ్ల అనుభవం కలిగిన నరసింహారెడ్డి 180 పరిశోధనా పత్రాలు, నాలుగు పుస్తకాలు, నాలుగు పేటెంట్లతో విశేష సేవలందించారు. 40 మంది పీహెచ్‌డీ పరిశోధకులకు మార్గదర్శకత్వం వహించారు.జాతీయ పురస్కారం అందుకున్న ప్రొఫెసర్‌ను కేయూ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె. ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ పురస్కారం విశ్వవిద్యాలయానికి గర్వకారణమని పలువురు పేర్కొన్నారు.

పోలీసుల విధులు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన!

మడికొండ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం

హనుమకొండ, అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి: మారెల్లి కిరణ్):



పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాల సందర్భంగా మడికొండ పోలీస్ స్టేషన్‌లో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌హెచ్‌వో పుల్యాల కిషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై పోలీసులు వివరించారు. పోలీసు ఆయుధాలు, బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్ల పనితీరును ప్రత్యక్షంగా చూపించి వాటి వినియోగాన్ని వివరించారు.సమాజ భద్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి అని పోలీసులు విద్యార్థులకు సూచించారు. ఇలాంటి కార్యక్రమాలు పోలీసు వ్యవస్థపై అవగాహన పెంచడంతో పాటు, చట్టాల పట్ల బాధ్యతాయుతమైన దృక్పథాన్ని అలవర్చేందుకు దోహదపడతాయి.

కేయూ పీహెచ్‌డీ దరఖాస్తు గడువు పొడిగింపు!

అక్టోబర్ 31 సాయంత్రం 5 గంటల వరకు అవకాశం

హనుమకొండ, అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):



కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని సైన్స్ విభాగాల్లో 2026 జూలై సెషన్ పీహెచ్‌డీ ప్రవేశాల దరఖాస్తు గడువును అక్టోబర్ 31 సాయంత్రం 5 గంటల వరకు పొడిగించినట్లు సైన్స్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫెసర్ బి. వెంకట్రాంరెడ్డి తెలిపారు. గతంలో అక్టోబర్ 24తో ముగిసిన గడువును విద్యార్థుల అభ్యర్థన మేరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 3న విడుదల చేసిన నోటిఫికేషన్‌లోని ఇతర నిబంధనలు యథాతథంగా ఉంటాయని స్పష్టం చేశారు. అర్హులైన అభ్యర్థులు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మైనర్ బాలిక ఘటనపై పోక్సో కేసు నమోదు

న్యూ శాయంపేట రిసార్ట్ వ్యవహారంపై పోలీసుల దర్యాప్తు

హనుమకొండ, అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి: మారెల్లి కిరణ్):

హనుమకొండ న్యూ శాయంపేట పరిధిలోని ఓ ప్రైవేట్ రిసార్ట్‌కు సంబంధించిన మైనర్ బాలిక ఘటనపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బాలిక తల్లి ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు హనుమకొండ సీఐ శివకుమార్ తెలిపారు.ప్రాథమిక విచారణలో బాలిక తెలిపిన వివరాలు, వైద్య పరీక్షల నివేదిక, ఇతర ఆధారాలను పరిశీలించిన అనంతరం ఘటనకు సంబంధించిన వాస్తవాలు వెల్లడవుతాయని పోలీసులు పేర్కొన్నారు. దర్యాప్తు పూర్తయ్యే వరకు ఘటనకు సంబంధించి ఎలాంటి నిర్ధారణకు రావద్దని సూచించారు.

నగరాభివృద్ధికి GWMC--NIT వరంగల్ కీలక ఒప్పందం!

అభివృద్ధి పనులకు సాంకేతిక సహకారం.. మున్సిపల్ అధికారులకు ప్రత్యేక శిక్షణ

హనుమకొండ, అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి):



వరంగల్ నగర సమగ్ర అభివృద్ధికి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (GWMC), నిట్ వరంగల్ మధ్య పరస్పర అవగాహన ఒప్పందం (MoU) కుదిరింది. నగరంలో చేపట్టే అభివృద్ధి పనులకు సాంకేతిక సలహాలు అందించడంతో పాటు, మున్సిపల్ ఇంజనీర్లు, అధికారులకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ ఇవ్వడం ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశం.ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, నిట్ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి, డిప్యూటీ డైరెక్టర్ ప్రొఫెసర్ రతీశ్ కుమార్, ప్రొఫెసర్ శంకర్, +ఔజీ కమిషనర్ టి. వెంకన్న తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సహకారంతో నగరాభివృద్ధి ప్రణాళికలు, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, మున్సిపల్ సేవల మెరుగుదలకు దోహదం చేయాలని అధికారులు భావిస్తున్నారు.

అంతర్జాతీయ నృత్య పోటీల్లో ఓరుగల్లు చిన్నారుల సత్తా!

రాయ్‌పూర్ వేదికగా పలు అవార్డులు కైవసం

నాట్య గురువు హిమస్ని కాట్రగడ్డకు అభినందనలు

హనుమకొండ, అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల -- ప్రతినిధి:)



అంతర్జాతీయ నృత్య పోటీల్లో వరంగల్‌కు చెందిన చిన్నారులు ప్రతిభ చాటారు. ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌లో నిర్వహించిన పోటీల్లో 'ది టెంపుల్ డాన్స్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్' విద్యార్థులు పలు అవార్డులు సాధించి ఓరుగల్లు ఖ్యాతిని చాటారు.జూనియర్ విభాగంలో చన్విత, స్తుతిశ్రీ ప్రథమ స్థానాలు సాధించగా, సబ్ జూనియర్ విభాగంలో జశ్రిత విజేతగా నిలిచారు. సంజన రెడ్డి 'గోపీకృష్ణ అవార్డు', సాయి త్రిపుర 'నృత్య హిరణ్మయి అవార్డు' అందుకున్నారు.విద్యార్థులకు శిక్షణనిచ్చి విజయాల దిశగా నడిపించిన నాట్య గురువు హిమస్ని కాట్రగడ్డను నిర్వాహకులు, ప్రముఖులు అభినందించారు. చిన్నారుల విజయంపై కళాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ దొంగల ముఠా గుట్టురట్టు!

- **తెలుగు రాష్ట్రాల్లో 29 చోరీలు.. నలుగురు నిందితులు అరెస్ట్**
- **రూ.20 లక్షల నగదు, రూ.30 లక్షల విలువైన రెండు కార్లు స్వాధీనం**

నల్గొండ, అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):



రైతుల వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును నల్గొండ జిల్లా పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేయగా, చోరీ చేసిన కాపర్ కాయిల్స్ కొనుగోలు చేస్తున్న మరో వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.పోలీసుల వివరాల ప్రకారం.. ఈ ముఠా తెలంగాణలో 25, ఆంధ్రప్రదేశ్‌లో 4 కలిపి మొత్తం 29 ట్రాన్స్‌ఫార్మర్ చోరీలకు పాల్పడింది. ఇందులో నల్గొండ జిల్లాలోనే 18 చోరీలు జరిగినట్లు గుర్తించారు. రాత్రివేళల్లో కార్లలో వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, వాటిలోని కాపర్ వైర్లు, ఆయిల్, ఇతర భాగాలను దొంగిలించేవారని తెలిపారు. నకిలీ నంబర్ ప్లేట్లతో పోలీసులకు చిక్కకుండా ప్రయత్నించినట్లు పేర్కొన్నారు. రూ.50 లక్షల విలువైన ఆస్తులు స్వాధీనం నిందితుల నుంచి రూ.20 లక్షల నగదు, సుమారు రూ.30 లక్షల విలువైన రెండు కార్లు, కాపర్ వైర్లు, కట్టర్లు, పానాలు, గ్లౌజులు, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ముఠాలోని మరో ఐదుగురు సభ్యులు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని వెల్లడించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రత్యేక బృందాలు కేసును ఛేదించాయని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. కేసును ఛేదించిన పోలీసు అధికారులను అభినందించి రివార్డులు అందజేశారు.

రూ.20 వేల లంచం.. లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్, పెట్రోల్ బంక్ టెక్నీషియన్ అరెస్ట్

యాదాద్రిభువనగిరిజిల్లా, అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):



పెట్రోల్ బంక్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ జారీ చేయడంతో పాటు డైలీ సేల్స్ రిజిస్టర్ అప్పగించేందుకు రూ.20 వేల లంచం డిమాండ్ చేసిన కేసులో లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్‌తో పాటు ఓ ప్రైవేట్ పెట్రోల్ బంక్ టెక్నీషియన్‌ను తెలంగాణ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు అరెస్ట్ చేశారు.ఏసీబీ వివరాల ప్రకారం.. అక్టోబర్ 28న హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్‌లో టెక్నీషియన్ లంచం తీసుకుంటుండగా అధికారులు గుర్తించారు. ఇన్‌స్పెక్టర్ సూచనల మేరకు ఈ లావాదేవీ జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. లంచం మొత్తంలో రూ.15 వేలు ఇన్‌స్పెక్టర్‌కు, రూ.5 వేలు టెక్నీషియన్‌కు చెందాల్సి ఉన్నట్లు ఏసీబీ వెల్లడించింది.అరెస్టు చేసిన ఇద్దరినీ న్యాయ రిమాండ్ నిమిత్తం ఏసీబీ కోర్టులో హాజరుపరిచే ప్రక్రియ చేపట్టారు. ఈ కేసుకు సంబంధించి తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది.లంచం అడిగితే 1064కు ఫిర్యాదు చేయండిప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు లేదా వాట్సాప్ నంబర్ 9440446106కు ఫిర్యాదు చేయవచ్చని అధికారులు సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు బొల్లం మల్లయ్య విజ్ఞప్తి

మండల, గ్రామస్థాయి నాయకత్వం సమన్వయంతో ముందుకు సాగాలి


కోదాడ నియోజకవర్గం, అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):



కోదాడ నియోజకవర్గవ్యాప్తంగా ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక చొరవ చూపాలని బొల్లం మల్లయ్య విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి మండలం, ప్రతి గ్రామంలో పార్టీ నాయకత్వం సమన్వయంతో పనిచేస్తూ ఓటరు నమోదు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.గ్రామస్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, అర్హులైన ఓటర్లు నమోదు ప్రక్రియపై అవగాహన పొందేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎవరూ నిర్లక్ష్యం చేయకుండా, సమష్టిగా ముందుకు వచ్చి తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నిర్వహించేందుకు నాయకులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని బొల్లం మల్లయ్య కోరారు.

కరువు నివారణకు ఉపాధి పనులు వేగవంతం చేయాలి!

విద్యుత్ పొదుపు, జల సంరక్షణకు ప్రాధాన్యం



భీమదేవరపల్లి, అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):

భీమదేవరపల్లి మండలాన్ని కరువు ప్రభావిత మండలంగా గుర్తించిన నేపథ్యంలో కరువు నివారణ చర్యలు, ఉపాధి పనుల అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మంత్రి సీతక్కతో పాటు రాష్ట్ర, జిల్లా అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పలు సూచనలు చేశారు.గ్రామాల్లో వి.బి.జి. రాంజీ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటూ పశువుల తొట్టెలు, ఇంకుడు గుంతలు, ఫామ్ పాండ్ల నిర్మాణం వంటి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు భూమిలో తేమశాతం పెరిగేలా చర్యలు చేపట్టాలని తెలిపారు.విద్యుత్‌ను పొదుపుగా వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీరేశం, ఎంపీవో నాగరాజు, మండల అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆత్మీయ నేతకు జన్మదిన శుభాకాంక్షలు.. మంత్రి పొంగులేటిని

కలిసిన జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు

- **హైదరాబాద్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన కడకంచి బాలమణి శ్రీనివాస్ దంపతులు**

జనగామ , అక్టోబర్ 28 (ప్రజానేస్తం జ్వాల):

తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి, జనగామ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి జన్మదినం సందర్భంగా జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ దంపతులు హైదరాబాద్‌లో మంత్రిని స్వయంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో తమకు ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని చాటుకుంటూ చైర్‌పర్సన్ దంపతులు శుభాకాంక్షలు తెలియజేయడం వారి అభిమానాన్ని ప్రతిబింబించిందని అనుచరులు పేర్కొన్నారు. మంత్రి మార్గదర్శకత్వంలో జనగామ పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని పట్టణ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్ పరిసరాల్లో ఏర్పాటు చేసిన జన్మదిన శుభాకాంక్షల ఫ్లెక్సీలు కాంగ్రెస్ కార్యకర్తలు, మంత్రి అభిమానుల దృష్టిని ఆకర్షించినట్లు వారి అనుచరులు తెలిపారు. గతంలో జనగామ పట్టణంలో వివిధ కార్యక్రమాల సందర్భంగా ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేసిన తరహాలోనే మంత్రి జన్మదినాన్ని పురస్కరించుకుని కూడా ప్రత్యేకంగా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి జనగామ మున్సిపల్ చైర్‌పర్సన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ దంపతులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా నిలిచింది.

